క్లుప్తంగా

మేడేను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు, కార్మికులు

బొబ్బిలి: మేడే(మే 1వ తేదీన జరిగే కార్యక్రమం)ను విజయవంతం చేయండి అని పట్టణ కలాసీ సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ పిలుపునిచ్చారు. స్థానిక కలాసీ సంఘ కార్యాలయం వద్ద మేడే కార్యక్రమ వివరాలు పొందుపరిచి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఆరోజు జెండా ఆవిష్కరణ, భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయని తెలిపారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి చేసే కార్యాచరణ లక్ష్యంగా ఆరోజు కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బి.అప్పలస్వామి, ఉపాధ్యక్షుడు పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా తరగతులు



యోగా తరగతులకు హాజరైన విద్యార్థులతో సత్యసాయి భజన మండలి సభ్యులు, తదితరులు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు ఉచితంగా ధ్యాన యోగా తరగతులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయవాది మామిడి వేణు గోపాలనాయుడు.. యోగా ప్రాముఖ్యత, ప్రజారోగ్యంలో యోగా ప్రధాన పాత్ర, ధ్యానం ద్వారా ఆయుష్షు పెంచుకునే మార్గాలను వివరించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే ఆరోగ్యం



ఆరోగ్య సలహాలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ

రేగిడి: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని, పుట్టిన ప్రతీ శిశువుకు కొన్ని నెలల పాటు ఖచ్చితంగా తల్లిపాలే ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ తెలిపారు. గురువారం మండలంలోని లచ్చారాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.


వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

రాజాం: స్థానిక బాలభవన్ వద్ద వేసవి శిక్షణా తరగతులు గురువారం ప్రారంభించారు. 40 రోజుల పాటు ఈ తరగతులు ఉంటాయని కోర్సు డైరెక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కొనసాగే ఈ తరగతుల్లో శాస్త్రీయ నృత్యం(భరతనాట్యం, కూచిపూడి), చిత్రలేఖనం, తబలా వాయిద్యం వంటి వాటిల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగు మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్.. రైతులకు ప్రకృతి సాగు విధానాలు–ప్రయోజనాలు తెలిపారు. అనంతరం చీడపీడల నివారణకు పురుగుమందులు బదులు వాడే దశకంత కషాయం తయారీ, వినియోగాన్ని వివరించారు. కషాయం తయారీకి స్థానికంగా లభించే 10 రకాల ఆకులు, పొగాకు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, శొంఠిపొడి తీసుకుని, ముద్దగా చేసుకుని, ఓ పాత్రలో వేసి వేడి చేయాలని, ఆ తర్వాత దానిని 20 లీటర్ల గోమూత్రంలో కలిపి వినియోగించాలన్నారు. ఒక డ్రమ్‌లో ఆ కషాయం నిల్వ ఉంచితే ఆరు నెలల పాటు ఈ కషాయాన్ని వినియోగించవచ్చన్నారు. ఎకరాకు లీటరు కషాయం పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి ప్రవీణ, యూనిట్ ఇన్‌చార్జ్ గౌరీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రాజాం ప్రధాన రోడ్డు



ఖాళీగా కనిపిస్తున్న రాజాం ప్రధాన కూడలి రోడ్డు

రాజాం: వేసవి ఎండల నేపథ్యంలో స్థానిక ప్రధాన కూడలి రోడ్డు గురువారం నిర్మానుష్యంగా కనిపించింది. ఉదయం 9 గంటల నుంచే ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ఏ ఒక్కరూ ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. అత్యవసరమైతే తప్ప జనాలెవరూ బయటకు రావడం లేదు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే బస్టాండ్, మార్కెట్, దుకాణ సముదాయాలు వెలవెలబోయాయి.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, ఆ దిశగా ఆయన తన ఐదేళ్ల పాలన కొనసాగించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకమైన ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అలాగే ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో జగనన్న సుపరిపాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి చెప్పే మాయ మాటలు నమ్మవద్దన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశ్యంతో వారు అమలు సాధ్యం కాని హామీలను సైతం మనముందు ఉంచుతారన్నారు. వారిని నమ్మితే మనం నట్టేట మునిగినట్లేనన్నారు. ప్రతీ ప్రాంతం, ప్రతిఒక్కరూ బాగుండాలంటే మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడిగంజి రమేష్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వర రావు(విను), కౌన్సిలర్ ఎస్.రామకృష్ణ(బాబు) తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి 'బాట'





చిత్రంలో కనిపిస్తోంది.. రేగిడి మండలంలోని ఉప్పర్నాయుడువలస ప్రధాన వీధి రోడ్డు. గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమైన రోడ్డులో గ్రామస్తులు నడిచివెళ్లాల్సిన దుస్థితి. ఈ సమస్యను ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి అధికారులను ఆదేశించారు. రూ.13 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. సమస్య పరిష్కారానికి సత్వరమే స్పందించిన ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి సర్పంచ్ కరణం గోవిందరావు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

–రేగిడి

ముఖ్యమంత్రిని కలిసిన వైస్ ఎంపీపీ



సీఎం జగన్‌తో వైస్ ఎంపీపీ వర్షిణి, చిత్రంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

రాజాం: మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా ఈ నెల 24వ తేదీన శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాజాం వైస్ ఎంపీపీ నక్క వర్షిణి మర్యాదపూర్వకంగా కలిసి, ఆల్ ది బెస్ట్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి, మళ్లీ ముఖ్యమంత్రిగానే రావాలని ఆకాంక్షించారు. ఇదే విషయమై ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సాయంతో ముఖ్యమంత్రిని దగ్గర నుంచి చూసే భాగ్యం కలిగిందని, సీఎం కూడా తనను ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

రాజాం టీడీపీ అభ్యర్థికి షాక్

- నామినేషన్ వేసిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ని రాజు
- ఎన్నికల్లో తప్పేదిలేదంటూ ప్రెస్‌మీట్
- బైక్ ర్యాలీతో నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి ఎన్ని రాజు

రాజాం: రాజాం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌కు భారీ షాక్ తగిలింది. కూటమిలో ఒకటైన జనసేన పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ని రాజు రాజాం ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలపై కోండ్రు గాండ్రించడం, నామినేషన్ సమయంలో జెండాలను పక్కకు తోసేయడం, వారి ఓట్లుతో పనిలేదంటూ ప్రెస్‌మీట్‌లో వెల్లడించడంతో మనస్థాపానికి గురయ్యారు. కన్నింగ్ మెంటాలిటీ ఉన్న కోండ్రుతో సాగలేమని నిర్ణయానికి వచ్చి నామినేషన్ దాఖలు చేసినట్టు కార్యకర్తలు పలువురు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున బైక్‌లతో ర్యాలీగా వెళ్లి రాజాం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఎల్.జోషఫ్‌కు ఎన్నిరాజు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ జనసేన పార్టీ అభ్యర్థి మాత్రమే గెలవగలడని, ఇతర పార్టీలు వైఎస్సార్ సీపీతో పోటీ పడలేవని స్పష్టం చేశారు. జనసేన తరపున నామినేషన్ వేశామని, పార్టీ బి–ఫామ్ ఇవ్వకుంటే స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో ఉంటానని స్పష్టంచేశారు. తనకు టీడీపీ నేతలతో సత్సంబంధాలు ఉన్నాయని, అధిక ఓట్లు సాధిస్తానని స్పష్టం చేశారు.

ప్రారంభమైన కేసుల పర్వం

జనసేన పార్టీ నాయకుడు నామినేషన్ వేయడాన్ని కూటమిలోని ఓ వర్గం జీర్ణించుకోలేకపోతుంది. ఓపెన్ టాప్ వ్యాన్‌పై ర్యాలీగా వచ్చిన జనసైనికులను పోలీసు అధికారులు అడ్డుకున్నారు. అనుమతిలేకుండా వ్యాన్ వాడారంటూ ఎన్నికల అధికారులు ఫిర్యాదు అందినట్టు చెప్పారు. కేసు నమోదుచేసి, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదుచేయడం వెనుక కూటమి కుట్ర ఉందని జనసైనికులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

రాజాం: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. నామినేషన్ల గడువు ముగిసే సమయానికి రాజాం నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానానికి 20 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోషఫ్ తెలిపారు. ఈ నెల 26వ తేదీన నామినేషన్ల స్క్రూటీనీ ఉంటుందని, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు.

బొబ్బిలి: నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి గాను మొత్తం 27 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి, ఆర్డీవో ఎ.సాయిశ్రీ తెలిపారు.

నేడు బాడంగిలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

బాడంగి: మండలంలోని వాడాడ, చినవాడాడ, కోటిపల్లి, మల్లంపేట, పాల్తేరు, బొత్సవానివలస, పూడివలస గ్రామాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు గురువారం తెలిపారు. మధ్యాహ్నం ప్రారంభమయ్యే ప్రచార కార్యక్రమానికి మండలానికి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..



పార్టీలో చేరిన వారితో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని కొరటాం గ్రామంలో గ్రామానికి చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్ లోచర్ల మంగమ్మ, లోచర్ల గణపతి, రవణమ్మ తదితర కుటుంబాల వారు ఉన్నారు. వీరందరికీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సీఎం జగన్ చేస్తున్న సుపరిపాలన నచ్చే తామంతా పార్టీలో చేరామని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్, మాజీ సర్పంచ్ జి.సుధ, ఎంపీటీసీ ఎస్.నాగమణి, పార్టీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు తదితరులు లు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



కొరటాంలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎంపీ బెల్లాన, పక్కనే ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: ప్రతి కుటుంబానికీ ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు అందించి, జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొల్లివలస, కొరటాం, గొలుగువలస, సతివాడ, ఆమిటి గ్రామాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి గురువారం పర్యటించిన ఆయనకు, ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రతీ వర్గంలోని ప్రజలకు లబ్ధి జరిగేలా పథకాలు రూపొందించి, ఇచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలతో ఎంతోమంది నిరుపేదల బతుకులు మారాయన్నారు. ఎప్పటిలాగే మళ్లీ ఈ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని తప్పకుండా గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ఎన్నికల వేళ బొబ్బిలి నియోజకవర్గంలో టీడీపీ తరపున పోటీ చేస్తున్న రాజులు మాయ మాటలు చెబుతున్నారని, వారి మాటలు నమ్మవద్దన్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలోని ప్రతీ సచివాలయంలో పరిధిలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామని, అలాగే అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. మరింత మేలు జరగాలంటే మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజారీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ అప్పలనాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు శేషగిరి, పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాశినాయుడు, కొరటాం ఎంపీటీసీ నాగమణి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజలకు మరింత మేలు



సోమరాజుపేటలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్, తదితరులు

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సోమరాజుపేట, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, మజ్జిరాముడుపేట, లక్ష్మీపురం, అక్కన్న అగ్రహారం గ్రామాల్లో గురువారం పర్యటించిన వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా, ఆఖరికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కావాలన్నా అధికారులు, ప్రజాప్రతినిధుల కాళ్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదని, గ్రామంలోని సచివాలయాల ద్వారానే పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ఒక్క రూపాయి లంచం లేకుండా సంక్షేమ పథకాలు వచ్చి, చేరుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ ఇంటికి జరిగిన మేలును మర్చిపోవద్దన్నారు. రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలంతా బాగుండాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ వేసి, తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు కె.వెంకటేశ్వరరావు, టి.ఉమాపాపినాయుడు, కె.శ్రీనివాసరావు, కె.గోవిందరావు, ఎస్.రమేష్‌నాయుడు, జి.రమణ, జి.అప్పలనాయుడు, ఎంపీటీసీలు ఎం.శ్రీనివాసరావు, ఆర్.నర్సింగరావు, అప్పలనాయుడు, గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ వేణుగోపాలనాయుడు, ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఆశతో టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు, అబద్ధపు హామీలను అస్సలు నమ్మవద్దని నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడిన వారు.. టీడీపీ నాయకులు ఇచ్చే తాయిలాలకు లొంగవద్దని, ఎవరు మేలు చేశారో చూసి, ఓట్లు వేయాలని కోరారు. మంత్రి పదవిలో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ కనీస అభివృద్ధి చేయని రాజులు.. ఎమ్మెల్యే పదవి ఇస్తే అభివృద్ధి చేస్తామని గ్రామాల్లో చెప్పుకుని తిరుగుతుండడం దారుణమన్నారు. రాజుల మోసపూరిత మాటలు వింటే సమస్యల పరిష్కారానికి వెళ్లిన వారు రాజులు పిలిచినంత వరకు కోట గేటు దగ్గర చేతులు కట్టుకుని నిలబడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. అదే మన రైతుబిడ్డ శంబంగి వెంకట చినఅప్పలనాయుడును గెలిపిస్తే, నేరుగా ఆయన ఇంట్లోకి వెళ్లి, మన సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ చొక్కాపు తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



బాడంగి: భీమవరంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వృద్ధురాలిని కోరుతున్న జిల్లా జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్



రామభద్రపురం: కోటశిర్లాంలో ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, తదితరులు

బాడంగి: మండలంలోని భీమవరం, చినభీమవరం గ్రామాల్లో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా శంబంగి వెంకట చినఅప్పలనాయుడును, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, పాల్తేరు ఎంపీటీసీ వంగపండు దివ్య, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: మండలంలోని కోటశిర్లాం గ్రామంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి ఎన్నికల ప్రచారం చేపట్టి, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామంలో నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించి, సీఎం జగనన్న ప్రజలకు చేసిన మేలును వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సంజీవనాయుడు, త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: కారాడలో వేణుగోపాలనాయుడు ఎన్నికల ప్రచారం

వలంటీర్ల రాజీనామా



బొబ్బిలి: రాజీనామా చేసిన అలజంగి వలంటీర్లు

రాజాం సిటీ: మండలంలోని దోసరి రామినాయుడువలస గ్రామ వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. అనంతరం వారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని, ఎంపీడీవో వి.శ్రీనివాసరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామ వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. వారంతా తమ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తమకు ఇన్నాళ్లు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలన్నారు.

మలేరియాను తరిమికొడదాం



రాజాం సిటీ: ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది, విద్యార్థులు



సంతకవిటి: మండల కేంద్రంలో ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్రప్రసాద్, సిబ్బంది

రాజాం సిటీ: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని పొగిరి గ్రామంలో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పొగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జి.భార్గవి, సిబ్బంది అంతా మలేరియాను తరిమికొడదాం అని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమలు లేకుండా చేయగలమని, తద్వారా మలేరియా నివారణ సాధ్యమన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మలేరియా జ్వరం బారినపడకుండా దోమతెరలు వాడాలని సూచించారు.

సంతకవిటి: మండల కేంద్రంతో పాటు మండాకురిటి గ్రామంలో ప్రపంచ మలేరియా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టి, మలేరియా జ్వరం బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మలేరియా సోకిన తర్వాత పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో సంతకవిటి పీహెచ్‌సీ వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.